సాక్షి
సూర్యాపేట

శుక్రవారం । 17 । అక్టోబర్ । 2025



అప్పులు తీర్చేందుకు..

అప్పులు తీర్చేందుకు మహిళపై దాడి చేసి పుస్తెలతాడు అపహరించిన దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు.

- IIలో



ఏసీబీకి చిక్కిన అధికారి

నల్లగొండలోని అగ్నిమాపక శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

- IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	:	590 అడుగులు
ఇన్‌ఫ్లో	:	83,888 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	83,888 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,495 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,363 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	600 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

రూపాయికే బీఎస్ఎన్ఎల్ కనెక్షన్

కోదాడ: దీపావళి పండుగను పురస్కరించుకొని బీఎస్ఎన్ఎల్ వినియోగ దారులకు ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. కేవలం రూపాయికే ప్రీపెయిడ్ మొబైల్ కనెక్షన్ ఇవ్వనుంది. ఈ పథకం అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు అమలులో ఉంటుందని ఉమ్మడి నల్లగొండ జిల్లా టెలికం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్క రూపాయితో నెల రోజుల పాటు ఉచితంగా అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత కాల్స్‌తో పాటు 2 జీబీ డెటా, 100 ఎస్ఎంఎస్‌లు ఉచితంగా పంపవచ్చని పేర్కొన్నారు. పోర్టబిలిటీ ద్వారా బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కి మారే వారు కూడా ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని, సిమ్‌కార్డ్ ఉచితంగా ఇస్తామని తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



కొత్తగూడెం రైతు వేదికలో అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

తుంగతుర్తి : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు పేర్కొన్నారు. గురువారం తుంగతుర్తి మండలం కొత్తగూడెం రైతు వేదికలో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ఆరు నెలలు పూర్తయిన పిల్లలకు అన్న ప్రాసన, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, తహసీల్దార్ దయానందం, ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీజ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణ, సూపర్‌వైజర్ ఖైరున్నిసా బేగం, మంగ, అనురాధ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి కొనసాగుతోంది. గురువారం మూసీ రిజర్వాయర్‌కు 3,613 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తి 2,748 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 195 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీపేజీ, లీకేజీ, ఆవిరి రూపంలో 50 క్యూసెక్కుల నీరు వృథా అవుతుంది. మూసీ ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 645 అడుగులు(4.46 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రం వరకు నీటిమట్టం 644.40 అడుగుల(4.30టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేసి స్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. అనంతరం నిత్యకల్యాణంలో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనం పై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశంచేసి నీరాజనమంత్ర పుష్పాలతో మహానివేదనచేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.



తాళిబొట్టు చూపుతున్న అర్చకుడు

గ్రామీణ రోడ్లకు మహర్దశ

హ్యామ్ కింద అభివృద్ధి, విస్తరణకు నేడు టెండర్లు

- ఉమ్మడి జిల్లాలోని 60 రోడ్లకు అవకాశం
- మరో ఆరు ప్రాంతాల్లో కొత్తవాటికి ప్రతిపాదనలు
- హైబ్రీడ్ అన్యూటీ మోడ్‌లో చేపట్టనున్న పనులు
- పీఆర్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగించేలా కార్యాచరణ

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి మోక్షం లభించనుంది. ఇప్పటికీ రోడ్లు సరిగ్గాలేని ప్రాంతాల్లో రహదారుల నిర్మాణంతోపాటు ఇరుకు రోడ్ల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ రోడ్ల నిర్మాణ పనులకు ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా హైబ్రిడ్ అన్యూటీ మోడ్‌లో (హ్యామ్) పద్ధతిలో ఈ పనులు చేపట్టనుంది. వీటికి 40 శాతం నిధులను ప్రభుత్వమే నిర్మాణ దశలో సమకూర్చనుండగా, 60 శాతం నిధులు కాంట్రాక్టు సంస్థలు వెచ్చించనున్నాయి. వీటికి ఈనెల 17న టెండర్లు పిలిచేందుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు చేపట్టింది.



విస్తరణకు నోచుకోనున్న సూర్యాపేట- దంతాలపల్లి రోడ్డు

జిల్లాలో 60 రోడ్ల అభివృద్ధి, విస్తరణ..

రాష్ట్ర వ్యాప్తంగా హ్యామ్ పద్ధతిలో 17 ప్యాకేజీల కింద 96 నియోజకవర్గాల పరిధిలోని 2,162 రోడ్ల అభివృద్ధి, విస్తరణను 7,449.50 కిలోమీటర్ల పొడవునా చేపట్టనుంది. అందులో మూడు ప్యాకేజీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 60 రోడ్ల అభివృద్ధికి అవకాశం దక్కనుంది. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తంగా 825.28 కిలోమీటర్ల పొడవునా రోడ్ల అభివృద్ధి, విస్తరణ పనులను చేపట్టనున్నారు. ఇవి కాకుండా మరో ఆరు ప్రాంతాల్లో రూ.560 కోట్లతో కొత్త రోడ్లను నిర్మించనున్నారు.

సర్కిల్–1లో ఐదు నియోజకవర్గాల్లో రోడ్ల అభివృద్ధి

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోని నియోజకవర్గాలను రెండు సర్కిళ్లుగా విభజించి, రెండు ప్యాకేజీలుగా పనులను గుర్తించారు. నల్లగొండ సర్కిల్ పార్ట్–1 కింద 184.72 కిలోమీటర్ల పొడవునా రోడ్లను అభివృద్ధి చేయనుండగా, 38.4 కిలోమీటర్ల పొడవునా డబుల్ రోడ్లుగా విస్తరించనున్నారు. ఇందులో మొత్తంగా నల్లగొండ, మునుగోడు, నకిరేకల్, నాగార్జునసాగర్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో అభివృద్ధి, విస్తరణ కలిపి 223.12 కిలోమీటర్ల పొడవునా రోడ్ల పనులను చేపట్టనున్నారు.

సర్కిల్ –2లో ఏడు నియోజకవర్గాల్లో..

నల్లగొండ సర్కిల్–2 పరిధిలో 26 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. నాగార్జునసాగర్, దేవరకొండ, మిర్యాలగూడ, కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లో రూ.320.80 కోట్లతో 314.66 కిలోమీటర్ల పొడవునా రోడ్ల అభివృద్ధిని చేపట్టనున్నారు.

నల్లగొండ-2 కింద..

- బరాకత్‌గూడెం –కాగిత రామచంద్రాపురం రోడ్డు (నడిగూడెం, కాగితరామచంద్రాపురం, సోమ్లా తండా)–7 కిలోమీటర్లు
- శాంతినగర్ నుంచి ఎన్‌హెచ్ 9 వరకు వయా గోండ్రియాల రోడ్డు (శాంతినగర్, గోండ్రియాల, చిమిర్యాల)–11.60 కిలోమీటర్లు
- కోదాడ–రేవూర్ రోడ్డు(కోదాడ, గుడిబండ, తొగర్రాయి, గణపవరం, ఎర్రారం)–12.60 కిలోమీటర్లు
- రాయినిగూడెం–బరాకత్‌గూడెం రోడ్డు(బేతవోలు, సీత్లాతండా, పోలేనిగూడెం, బరాకత్‌గూడెం)–11.60 కిలోమీటర్లు
- శాంతినగర్–నడిగూడెం రోడ్డు (శాంతినగర్, అనంతగిరి, అమీనాబాద్)–6 కిలోమీటర్లు
- హుజూర్‌నగర్ లింక్ రోడ్డు – 2 కిలోమీటర్లు
- హుజూర్‌నగర్ రింగ్ రోడ్డు–4.15 కిలోమీటర్లు
- దురాజ్‌పల్లి–గరిడేపల్లి రోడ్డు (దురాజ్‌పల్లి, సింగారెడ్డిపాలెం, అనంతారం ఎక్స్‌రోడ్డు, పెన్‌పహాడ్, మాచారం, దూపహాడ్) 12.20 కిలోమీటర్లు
- హుజూర్‌నగర్–యాతవాకిల్ల రోడ్డు (హుజూర్‌నగర్, లింగగిరి) 4 కిలోమీటర్లు
- కోదాడ–రేవూర్ రోడ్డు(కందిబండ, హేమ్లా తండా, మేళ్లచెర్వు , రేవూర్) 7.45 కిలోమీటర్లు
- హుజూర్‌నగర్–మేళ్లచెరువు రోడ్డు (హుజూర్‌నగర్, వేపలసింగారం, మేళ్లచెరువు) 11.10 కిలోమీటర్లు
- దామరచర్ల–జాన్‌పహాడ్ రోడ్డు 4.50 కిలోమీటర్లు
- సూర్యాపేట–నెమ్మికల్–దంతాలపల్లిరోడ్డు (గుండ్లసింగారం, నూతనకల్, ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్డు, మద్దిరాల) 18.40 కిలోమీటర్లు
- సూర్యాపేట–నెమ్మికల్–దంతాలపల్లి రోడ్డు నుంచి 0.0 కిలోమీటర్ నుంచి 18.0 (కుడకుడ, ఐలాపురం, గుర్రంతండా, నెమ్మికల్, పాతర్లపహాడ్)–18.00 కిలోమీటర్లు
- దురాజ్‌పల్లి–గరిడేపల్లి రోడ్డు(దురాజ్‌పల్లి–సింగారెడ్డిపాలెం, అనంతారం ఎక్స్‌రోడ్డు, పెన్‌పహాడ్, మాచారం, దూపాడ్)–15 కిలోమీటర్లు
- మామిడాల–కుంటపల్లి రోడ్డు (మామిడాల, గొట్టిపర్తి, రావులపల్లి ఎక్స్‌రోడ్డు, గుమ్మడపల్లి ఎక్స్‌రోడ్డు, కుంటపల్లి) 18.40 కిలోమీటర్లు
- మాచారం–చీదెళ్ల రోడ్డు (మాచారం, అనిరెడ్డిగూడెం, గాజులమల్కాపురం, చీదెళ్ల రోడ్డు –11.00 కిలోమీటర్లు.

విధులకు హాజరుకాని సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం



మునగాల తహసీల్దార్‌ను వివరణ కోరతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

- మునగాల తహసీల్దార్ కార్యాలయం తనిఖీ
- డుమ్మా కొట్టిన నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్
- సమయ పాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

మునగాల: కార్యాలయ నిర్దేశిత ప్రారంభ సమయం దాటినా సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంపై కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలు ఆరా తీసి విధులకు డుమ్మా కొట్టిన నలుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేశారు. గురువారం మునగాల తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ డి.సత్యనారాయణ, ఎంపీఎస్ఓ బి.సంపత్, జూనియర్ అసిస్టెంట్ ఎం.సునీల్ గవాస్కర్, రికార్డ్ అసిస్టెంట్ జి.ప్రశాంత్‌లు విధులకు రిపోర్ట్ చేయలేదు. ఉదయం 10.30 గంటలు దాటినా విధులకు హాజరుకాకపోవడంతో వీరిని సస్పెండ్ చేశారు. ఈ అంశంపై కలెక్టర్ తహసీల్దార్‌ను వివరణ కోరారు. కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయ అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించగా మొత్తం కార్యాలయంలో 18 మంది ఉద్యోగులకు గాను నలుగురు డిప్యుటేషన్‌పై ఇతర కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. మరో ఇద్దరు ఆకస్మిక సెలవులో ఉండగా మరొక ఉద్యోగి సర్వే విధులకు వెళ్లినట్లు గుర్తించారు. కాగా డిప్యూటీ తహసీల్దార్, ఎంపీఎస్ఓ, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ విధులకు హాజరు కాలేదు. మిగిలిన వారు హాజరైనట్లు కలెక్టర్ గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ప్రతి ఉద్యోగి సకాలంలో విధులకు హాజరు కావాలని, ఒకవేళ విధులకు గైర్హాజరైనా, ఆలస్యంగా వచ్చినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

భానుపురి (సూర్యాపేట) : ఈ వానాకాలం సీజన్ ధాన్యం సేకరణకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సంసిద్ధంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏపీఎంలు, సీఈఓ లతో 2025– 26 వానాకాలం సీజన్ ధాన్యం సేకరణ పై వెబ్ ఎక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.రెండు మూడు రోజుల్లో అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. సన్న, దొడ్డు వడ్లకు వేర్వేరుగా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల వడ్లు కాంటా అయిన తర్వాత వెంటనే మిల్లులకు తరలించాలని చెప్పారు. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న మండలాల్లో పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ రాము, డీఆర్‌డీఓ వి.వి అప్పారావు, డీసీఓ పద్మ, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగేశ్వర్ శర్మ, సివిల్ సప్లయ్ అధికారులు శ్రీనివాస్ రెడ్డి, బెనర్జీ పాల్గొన్నారు.

వైద్యసాయం అందేవరకూ సీపీఆర్ చేయాలి

భానుపురి (సూర్యాపేట) : గుండె పనిచేయకుండా ఆగిపోయిన వ్యక్తులకు వైద్య సహాయం అందే వరకూ ప్రాణాలు నిలపడానికి సీపీఆర్ (కార్డియోపల్మనరీ రీససిటేషన్) అత్యవసరమని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. గురువారం సూర్యాపేట కలెక్టరేట్‌లో సిబ్బందికి సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుండె పనిచేయకుండా ఆగిపోయి శ్వాస తీసుకోకుండా స్పృహ కోల్పోయిన వ్యక్తులకు మాత్రమే సీపీఆర్ విధానం ఉపయోగించాలన్నారు. గుండెపోటుకు ఈ విధానం ఉపయోగించరాదని సూచించారు. ఇటీవల గుండె పనిచేయకుండా ఆగిపోవడం లాంటి సంఘటనలు పెరిగిపోతున్నాయని, అలాంటి సమయంలో సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని, తద్వారా ఎవరైనా ప్రమాదంలో ఉంటే వెంటనే స్పందించి సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడిన వారవుతారన్నారు. సీపీఆర్ చేసేటప్పుడు వ్యక్తులను బట్టి ఛాతీపై ఒత్తిడి చేయాలని, ఎక్కువ ఒత్తిడి చేయకూడదని సూచించారు. అనంతరం వైద్యులు స్వజన, శరణ్య సీపీఆర్ ఎలా చేయాలో అందరికీ అర్థమయ్యేలా ప్రాక్టికల్‌గా చూపించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీఎంహెచ్ఓ చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

హాజరు మెరుగాయే..

- జూనియర్ కాలేజీల్లో సత్ఫలితాలిస్తున్న ఫేస్‌రికగ్నిషన్ సిస్టమ్
- 20 నుంచి 25శాతం పెరిగిన విద్యార్థుల హాజరు
- డుమ్మాకొడితే తల్లిదండ్రులకు సమాచారం



హాజరు నమోదు చేస్తున్న అధ్యాపకుడు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	8
మొదటి సంవత్సరం విద్యార్థులు	1559
రెండవ సంవత్సరం విద్యార్థులు	1444

తిరుమలగిరి (తుంగతుర్తి) : ఇంటర్మీడియట్ స్థాయిలో సర్కారు విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జిల్లా స్థాయి అధికారులతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షిస్తోంది. ఉపాధ్యాయులతో పాటు సిబ్బందికి రోజుకు రెండుసార్లు ముఖ గుర్తింపు హాజరు అమలు చేస్తోంది. విద్యార్థులకు ఒక పూట ఫేస్‌రికగ్నిషన్ హాజరునమోదు చేస్తున్నారు. దీంతో పాటు ప్రతి నెలా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తుండటం సత్ఫలితాలిస్తోంది.

గైర్హాజర్ అయితే తల్లిదండ్రుల సెల్‌ఫోన్లకు మెసేజ్

ముఖ గుర్తింపు హాజరు కోసం ఇంటర్ బోర్డు అధికారులు టీజీబీఐఈఆర్ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను తీసుకొచ్చారు. దీని ద్వారా ప్రస్తుతం ప్రతిరోజు విద్యార్థుల హాజరు తీసుకుంటున్నారు. ఈ విధానం వల్ల గతంలో కంటే 20 నుంచి 25 శాతం విద్యార్థుల హాజరు పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఏ విద్యార్థి అయినా కళాశాలకు హాజరు కాకుంటే తల్లిదండ్రుల సెల్‌ఫోన్‌లకు మెసేజ్ వెళుతుంది. విద్యార్థుల తల్లిదండ్రులకు మెసేజ్ అందిన తరువాత తల్లిదండ్రుల నుంచి సంబంధిత కళాశాల అధ్యాపకులకు ఫోన్ రాకపోతే కళాశాల అధ్యాపకులే తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి కారణాలు తెలుసుకుంటున్నారు. ఇలా చాలా రోజులు కళాశాలకు రాని విద్యార్థుల ఇళ్లకు అధ్యాపకులు వెళ్లి వారితో మాట్లాడి చదువు విశిష్టతను తెలిపి కాలేజీకి పంపేలా చేస్తున్నారు. ప్రస్తుతం ఉదయం వేళ మాత్రమే విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు అమలు చేస్తున్నారు. మరికొన్ని రోజుల్లో మధ్యాహ్నం తరువాత కూడా అమలులోకి తీసుకురానున్నారు.

విద్యార్థుల హాజరు పెంచేందుకే..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఇంటర్ బోర్డు ముఖ గుర్తింపు హాజరును ప్రవేశ పెట్టింది. ఈ విధానం వల్ల విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరవుతున్నారు. దీంతో పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చు. తరచూ కళాశాలకు హాజరుకాని విద్యార్థులపై పర్యవేక్షణ పెరుగుతుంది.

– మృత్యుంజయ, ప్రిన్సిపాల్, తిరుమలగిరి.

బీసీ బంద్‌కు పూర్తి మద్దతు

భానుపురి (సూర్యాపేట) : ఈనెల 18వ తేదీన బీసీ జేఏసీ నిర్వహించ తలపెట్టిన తెలంగాణ బంద్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బంద్‌లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు కళల్లోనూ రాణించాలి

సూర్యాపేట టౌన్ : విద్యార్థులు చదువుతో పాటు వివిధ కళల్లోనూ రాణించాలని జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్ సూచించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఫోక్ డ్యాన్స్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీల్లో జిల్లాలోని తొమ్మిది పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ రాధాకృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

నేరస్తులపై ప్రత్యేక నిఘా

- ఎస్పీ నరసింహా

అర్వపల్లి: జిల్లాలో నేరస్తులపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్లు ఎస్పీ కె.నరసింహ తెలిపారు. అర్వపల్లి పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయన తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించి నేరాలు, ఇతర కేసులకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడే వ్యక్తులు, వర్గాలపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు నమోదు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా సత్వర న్యాయం చేయాలన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్లలో సమస్య పరిష్కారం కాలేదనుకుంటే సీఐ, డీఎస్పీల వద్దకు వెళ్లాలని అక్కడా న్యాయం జరగడంలేదని భావిస్తే ఎస్పీ కార్యాలయానికి రావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఈట సైదులు, ఏఎస్ఐ రామకోటి, హెడ్‌కానిస్టేబుల్ సుధీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ సెంటర్ వద్ద రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహా

బీసీ బంద్‌కు సహకరించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు

సూర్యాపేట : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్ చేర్చి పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన బీసీ జేఏసీ ఇచ్చిన తెలంగాణ బంద్‌కు జిల్లా వ్యాప్తంగా వాణిజ్య, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, హోటళ్లు సహకరించాలని పలు ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం సూర్యాపేటలోని ఓ హోటల్‌లో తెలంగాణ జన సమితి నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. రాజకీయ విద్య ఉద్యోగ అవకాశాలలో వెనుకబడిన తరగతుల వారికి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన బిల్లుకు పార్లమెంట్‌లో వెంటనే చట్టం చేయాలని కోరారు. తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంత సత్యనారాయణ పిళ్లే, నాయకులు చింతలపాటి శ్రీరాములు, అనంతుల మధు, మట్టిపల్లి సైదులు, బూర వెంకన్న, యాతాకుల రాజయ్య , చలమల నరసింహ, పొంగోటి రంగ, జనార్దన్, యాదగిరిరావ్, భద్రయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో వ్యవసాయ కళాశాల

- మంత్రివర్గ సమావేశంలో ఆమోదం
- ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించేలా ప్రణాళిక
- తొలుత ప్రైవేట్ భవనంలో తరగతులు
- కొలిక్కివచ్చిన స్థల సేకరణ ప్రక్రియ!

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌కు వ్యవసాయ కళాశాల మంజూరైంది. ఈమేరకు రాష్ట్ర మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుంచే బీఎస్సీ అగ్రికల్చర్ తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కాలేజీ కోసం ఇప్పటికే స్థల సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చినట్లు తెలిసింది.

కోర్సులు ఇలా..

హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ కాలేజీ.. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉంటుంది. ఈ కాలేజీలో ముఖ్యంగా బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు ఉంటుంది. దీనిలో వ్యవసాయానికి సంబంధించిన కోర్సులు ఉంటాయి. అగ్రానమీ, సాయిల్ సైన్స్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్, పెథాలజీ, ఎంటమాలజీ, హార్టికల్చర్, న్యూట్రిషన్ తదితర వ్యవసాయ అనుబంధ కోర్సులు ఉంటాయి. నాలుగేళ్ల (బీఎస్సీ)కోర్సులో భాగంగా తొలి ఏడాదికి సంబంధించి వంద మంది వరకు విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇచ్చే అవకాశం ఉంది.



భూములకు సంబంధించిన మ్యాప్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ (ఫైల్)

పూర్తికావొచ్చిన స్థల సేకరణ ప్రక్రియ!

హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న వ్యవసాయ కళాశాల కోసం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చొరవతో ఆచార్య జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులు ఇటీవల నియోజకవర్గంలోని మండలాల్లో వివిధ చోట్ల అనువైన భూములను పరిశీలించారు. మొత్తం మీద హుజూర్ నగర్ శివారులోని మగ్దూం నగర్ వద్ద ఉన్న ప్రభుత్వ భూములు కళాశాల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నారు. స్థల సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావొచ్చినట్లు సమాచారం. ఈనేపథ్యంలో హుజూర్‌నగర్‌లో ప్రభుత్వం వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఈ ప్రాంత ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ భవనంలో..

ఈ విద్యా సంవత్సరం నుంచే హుజూర్‌నగర్‌లో కళాశాల తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించింది. దీని కోసం హుజూర్‌నగర్ పట్టణంలోని ఏదైనా ప్రైవేట్ భవనంలో కళాశాల ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయ కళాశాలలో బోధించేందుకు దాదాపు 25 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రానుండగా, పాతిక మంది వరకు స్థానికులకు ఉద్యోగాలు దక్కే అవకాశం ఉంది.

రైతులకు సరైన వ్యవసాయ సూచనలు అందే అవకాశం

వ్యవసాయ కళాశాల ఏర్పాటుతో ఈ ప్రాంతంలోని రైతులకు వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు సంబంధించి సరైన సూచనలు సలహాలు అందే అవకాశం ఉంది. సాంకేతిక సలహాలు లభించనున్నాయి. విత్తనాలు, పురుగు మందులు, కొత్తకొత్త వంగడాలకు సంబంధించిన సమాచారం, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు మరింత చేరువకానుంది. తద్వారా వారికి మరింత లబ్ధిచేకూరనుంది. ఈ కళాశాల ద్వారా నూతన వంగడాలు రైతులకు అందుబాటులో ఉంచే అవకాశం ఉంది.

క్లుప్తంగా

యాదగిరి క్షేత్రంలో సుదర్శన హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్యారాధనలు ఆగమశాస్త్రానుసారంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టి, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం, సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



నర్సమ్మ (ఫైల్)

మిర్యాలగూడ టౌన్: ఇంట్లో దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మహిళ మృతిచెందింది. ఈ ఘటన మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉట్లపల్లి గ్రామానికి చెందిన సిరశాల నర్సమ్మ(58) భర్త గతంలోనే మృతిచెందాడు. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. ఇంట్లో ఆమె ఒంటరిగానే నివాసముంటోంది. నర్సమ్మ ఇంటికి కొంత దూరంలో ఆమె కుమారుడు లింగయ్యకు నివాసముంటున్నాడు. బుధవారం కూలి పనులను వెళ్లిన నర్సమ్మ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చింది. అనంతరం ఇంటి ఆవరణలో దుస్తులు ఉతికి పక్కనే ఉన్న ఇనుప తీగపై ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. రాత్రివేళ ఎవరూ చూడకపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. గురువారం తోటి కూలీలు నర్సమ్మను కూలి పనులకు పిలిచేందుకు ఇంటికి ఆమె వెళ్లగా విగతజీవిగా పడి ఉంది. దీంతో ఆమె కుమారుడికి సమాచారం అందించారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు..



లక్ష్మయ్య (ఫైల్)

అడ్డగూడూరు: వ్యవసాయ బావిలో పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన అడ్డగూడూరు మండలం జానకీపురం గ్రామ శివారులో గురువారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జానకీపురం గ్రామానికి చెందిన కట్కూరి లక్ష్మయ్య(86) మంగళశారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా లక్ష్మయ్య ఆచూకీ లభించకపోవడంతో బుధవారం కుటుంబ సభ్యులు అడ్డగూడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో గురువారం గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావిలో లక్ష్మయ్య మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పులు తీర్చేందుకు చైన్ స్నాచింగ్

- మహిళపై దాడిచేసి పుస్తెలతాడు అపహరించిన దొంగ
- 24 గంటల్లోనే పట్టుకున్న పోలీసులు
- స్కూటీ, రూ.2.50 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

శాలిగౌరారం: అప్పులు తీర్చేందుకు గాను మహిళపై దాడి చేసి ఆమె మెడలోని పుస్తెలతాడు అపహరించిన దొంగను పోలీసులు 24 గంటలు గడువకముందే అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నకిరేకల్‌లోని శాలిగౌరారం సర్కిల్ కార్యాలయంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన నాగుల శ్రీనివాస్ వృత్తిరీత్యా చేనేత కార్మికుడు. ప్రస్తుతం అతడు కుటుంబంతో కలిసి నల్లగొండ పట్టణంలోని పద్మానగర్‌లో నివాసముంటున్నాడు. శ్రీనివాస్ గతంలో తన ఇద్దరు కుమార్తెల వివాహాలు చేసేందుకు గాను అప్పులు చేశాడు. దీనికి తోడు కరోనా సమయంలో అతడి భార్య అనారోగ్యానికి గురికావడంతో మరింత అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువ కావడంతో పాటు వాటికి వడ్డీలు పెరిగిపోతుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఎలాగైనా అప్పులు తీర్చాలని శ్రీనివాస్ భావించాడు. ప్రస్తుతం బంగారం ధరలు విరీతంగా పెరగడంతో బంగారం దొంగతనం చేసినట్‌లైతే అప్పులు తొందరగా తీర్చవచ్చని అనుకున్నాడు. ఈ క్రమంలో బుధవారం నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి చెందిన ఆవుల సావిత్రమ్మ శాలిగౌరారం మండలం మాధారంకలాన్ శివారులో ఉన్న తన వ్యవసాయ భూమి వద్దకు నడుచుకుంటూ వెళ్తుండగా.. శ్రీనివాస్ స్కూటీపై అటుగా వెళ్తూ.. సావిత్రమ్మను చూసి స్కూటీ ఆపాడు. ఎక్కడకు వెళ్తున్నావ్ అని ఆమెను అడగగా.. ఆమె మాధారంకలాన్ వెళ్తున్నానని చెప్పింది. తాను అటువైపే వెళ్తున్నానని చెప్పి ఆమెను శ్రీనివాస్ తన స్కూటీపై ఎక్కించుకున్నాడు. మాధారంకలాన్ గ్రామ పంచాయతీ పరిధిలోని చొల్లగూడెం వద్ద గల 365వ నంబర్ జాతీయ రహదారి జంక్షన్ సమీపంలోకి రాగానే టాయిలెట్ వస్తుందని స్కూటీని ఆపాడు. స్కూటీ దిగిన సావిత్రమ్మ రోడ్డు వెంట నడుచుకుంటూ చొల్లగూడెం జంక్షన్ వైపు వస్తుండగా.. వెనుక నుంచి స్కూటీపై వచ్చిన శ్రీనివాస్ ఇనుపరాడ్డుతో సావిత్రమ్మ తలపై విచక్షణారహితంగా కొట్టడంతో ఆమె కిందపడిపోయింది. శ్రీనివాస్ వెంటనే సావిత్రమ్మ మెడలోని నాలుగున్నర తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని స్కూటీపై పారిపోయాడు. దొంగిలించిన బంగారు పుస్తెల తాడును నల్లగొండ పట్టణంలోని మణప్పురం ఫైనాన్స్‌లో తాకట్టుపెట్టి రూ.3.11 లక్షలు రుణం తీసుకున్నాడు. అందులో నుంచి రూ.61వేలు సొంత అవసరాలకు వాడుకొని.. మిగిలిన రూ.2.50 లక్షలు ఇంట్లో పెట్టుకున్నాడు. బాధితురాలి కుమారుడు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు శాలిగౌరారం, నకిరేకల్ సీఐల నేతృత్వంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడు శ్రీనివాస్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. అతడి నుంచి ద్విచక్ర వాహనం, రూ.2.50 లక్షల నగదు, ఇనుప రాడ్డు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చిన జడ్జి ఆదేశానుసారం రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. డీఎస్పీ శివరాంరెడ్డి, శాలిగౌరారం, నకిరేకల్ సీఐలు కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి ఎస్ఐలు సైదులు, లచ్చిరెడ్డి, సతీష్, పోలీస్ సిబ్బంది జానయ్య, లక్ష్మణ్, సతీస్, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సురేశ్, శ్రీకాంత్‌ను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారు.

ఏసీబీకి చిక్కిన అగ్నిమాపక అధికారి

- టపాకాయల దుకాణం ఏర్పాటుకు ఎన్‌ఓసీ ఇచ్చేందుకు లంచం డిమాండ్



సత్యనారాయణరెడ్డి, అగ్నిమాపక అధికారి

నల్లగొండ: టపాకాయల దుకాణం లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ నల్లగొండ పట్టణంలోని అగ్నిమాపక కార్యాలయం అధికారి సత్యనారాయణరెడ్డి గురువారం ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దీపావళి సందర్భంగా టపాకాయల దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు గాను అనుమతి కోసం నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారి సత్యనారాయణరెడ్డిని ఓ వ్యాపారి సంప్రదించాడు. ఎన్‌ఓసీ మొత్తం తానే చేసి ఇస్తానని ఇవ్వాలని సదరు వ్యాపారిని సత్యనారాయణరెడ్డి రూ.10వేలు డిమాండ్ చేశాడు. చివరకు రూ.8వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో సదరు వ్యాపారి ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ గ్రౌండ్‌లో వ్యాపారి నుంచి సత్యనారాయణరెడ్డి రూ.8వేలు లంచం తీసుకుంటుండగా నల్లగొండ రేంజ్ యూనిట్ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సత్యనారాయణరెడ్డిపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయని వాటిపై పూర్తిస్థాయిలో విచారించి నాంపల్లి ఏసీబీ కోర్టు ముందు హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1084 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ధాన్యం కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



కల్వలపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని పులిపలపులు, కల్వలపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే రైతులు తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, ఎంపీడీఓ యుగేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు సింగం వెంకన్న, ఎన్.శేఖర్‌రెడ్డి, సీఈఓ సుఖేందర్, మాజీ ఎంపీటీసీ భీమనపల్లి సైదులు, ఏఈఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ తీగలు తగిలి యువకుడు మృతి

- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువుల ఆరోపణ
- కొండమల్లేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా



వెంకటేష్ (ఫైల్)



విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు

కొండమల్లేపల్లి: పొలం వద్ద నేలపై పడి ఉన్న కరెంట్ తీగలు తగిలి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట్ల గ్రామానికి చెందిన జటమోని శ్రీను, వెంకటమ్మ దంపతుల పెద్ద కుమారుడు జటమోని వెంకటేష్(23) గురువారం ఉదయం తమ పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పొలం గట్లు పైన నడుచుకుంటూ వెళ్తుండగా అప్పటికే నేలపై పడి ఉన్న విద్యుత్ తీగలు అతడి కాలుకు చుట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం వద్దకు వెళ్లిన వెంకటేష్ ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పొలం వద్ద విగతజీవిగా పడి ఉన్నాడు. విద్యుత్ తీగలు నేలపై పడి ఉన్నాయని నాలుగు రోజుల క్రితమే ఫిర్యాదు చేసినప్పటికి లైన్‌మన్, విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా..

వెంకటేష్ మృతికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని పేర్కొంటూ అతడి బంధువులు, గ్రామస్తులు కొండమల్లేపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మృతదేహంతో ధర్నా నిర్వహించారు. పోలీసులు, విద్యుత్ సబ్ స్టేషన్ అధికారులు నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చేతికొచ్చిన కుమారుడి మరణంతో తల్లిదండ్రులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

ఇంటిపై నుంచి జారిపడి దుర్మరణం



కృష్ణారెడ్డి (ఫైల్)

భూదాన్‌పోచంపల్లి: నూతనంగా నిర్మిస్తున్న ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన గురువారం భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దగూడెం గ్రామంలో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగూడెం గ్రామానికి చెందిన రైతు పారిపల్లి కృష్ణారెడ్డి(55) గ్రామంలో నూతనంగా రెండంతస్తుల ఇంటిని నిర్మిస్తున్నాడు. గురువారం ఇంటి స్లాబ్‌కు క్యూరింగ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి భవనంపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారు గమనించి చికిత్స నిమిత్తం కారులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు పరీక్షించి అప్పటికే కృష్ణారెడ్డి మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య జయమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

అంబులెన్స్ సేవలు ఉపయోగించుకోవాలి

- ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ రాష్ట్ర ఆడిట్ అధికారి పకీర్ దాస్



108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ ఆడిట్ అధికారి పకీర్ దాస్

మిర్యాలగూడ అర్బన్: అత్యవసర సమయంలో 108 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీవీకే ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ రాష్ట్ర ఆడిట్ అధికారి పకీర్ దాస్ అన్నారు. గురువారం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో 108 వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబులెన్స్‌లో ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల పరికరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని టెక్నీషియన్లకు సూచించారు. అంబులెన్స్‌లోని అత్యవసర సేవలకు ఉపయోగించే పల్స్ ఆక్సీమీటర్, మానిటర్, ఏఈడీ, ఆక్సిజన్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట 108 జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం, ఈఎంఈ యల్లావుల మధు, ఈఎంటీ వెలిజాల సైదులు, పైలెట్ పగిళ్ల జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ

వేములపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గల 108 అంబులెన్స్ వాహనాన్ని జీవీకే ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ రాష్ట్ర ఆడిట్ అధికారి పకీర్ దాస్ గురువారం తనిఖీ చేశారు. ఆయన వెంట కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సలీం, ఈఎంఈ ఎల్లావుల మధు, సిబ్బంది విమల, అజ్రకుమార్ తదితరులున్నారు.

రౌడీ షీటర్ నవీన్‌రెడ్డి నగర బహిష్కరణ

- నోటీసులు జారీ చేసిన రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు
- నవీన్‌రెడ్డి స్వస్థలం నల్లగొండ మండలం ముశంపల్లి

నల్లగొండ: రంగారెడ్డి జిల్లా మన్నెగూడకు చెందిన రౌడీ షీటర్ కొడుదుల నవీన్‌రెడ్డిని రాచకొండ పోలీసులు నగర బహిష్కరణ చేశారు. ఆరు నెలల పాటు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎందుకు బహిష్కరించకూడదో 7 రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు గురువారం నవీన్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు. నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన కొడుదుల నవీన్‌రెడ్డి పదేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడ అతడు మిస్టర్ టీ, మిస్టర్ ఇరానీ టీ ఫ్రాంచైజీ పేరుతో బిజినెస్ చేస్తున్నాడు. అతనిపై రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో దాడి, హత్యాయత్నాలు, బెదిరింపులు, అల్లర్ల కేసులు నమోదయ్యాయి. రౌడీ షీటర్‌గా చెలామణి అవుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్న నవీన్‌రెడ్డితో శాంతిభద్రతలకు విఘాతం కల్గుతుందని భావించి నగర బహిష్కరణ చేసినట్లు అతడికి ఇచ్చిన నోటీసుల్లో సుధీర్‌బాబు పేర్కొన్నారు.

కిడ్నాప్ ఉదంతంతో వెలుగులోకి..

2022 డిసెంబర్‌లో రంగారెడ్డి జిల్లా తుర్కయాంజల్‌కు చెందిన ఓ మహిళా డాక్టర్‌ను నవీన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి కిడ్నాప్ చేసి వార్తల్లో నిలిచాడు. వారిద్దరికి బ్యాడ్మింటన్ అకాడమీలో పరిచయం ఏర్పడగా.. నవీన్‌రెడ్డి ప్రేమను సదరు మహిళా డాక్టర్ నిరాకరించడంతో ఆమెపై ద్వేషం పెంచుకుని 40 మంది గూండాలను వెంటేసుకుని ఇంట్లోకి చొరబడి ఆమె నిశ్చితార్థం జరగకుండా అడ్డుకొని కిడ్నాప్ చేశాడు. ఆమె తండ్రి దామోదర్‌రెడ్డి ఆపడానికి యత్నించగా అతడిపై కూడా దాడి చేశాడు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితంలేని వ్యక్తి..



మతిస్థిమితంలేని వ్యక్తి (ఫైల్)

తిప్పర్తి: తిప్పర్తి మండలం చిన్నాయిగూడెం సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితంలేని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 30ఏళ్ల వయస్సున్న మతిస్థిమితంలేని వ్యక్తి చిన్నాయిగూడెం వద్ద రోడ్డు దాటుతుండగా డీసీఎం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం తిప్పర్తి పంచాయతీ కార్యదర్శి నర్సింహ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి



అప్పిరెడ్డి (ఫైల్)

మునగాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మునగాల ఎస్ఐ బి. ప్రవీణ్‌కుమారు తెలిపిన వివరాల ప్రకా రం.. మునగాల మండలం కోదండరామాపురం గ్రామానికి చెందిన రెణబోతు అప్పిరెడ్డి(75), రెణబోతు లక్ష్మీనరసింహారెడ్డి బుధవారం కోదాడ మండలం కందిబండ గణపవరంలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా.. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై మునగాల మండలం ఆకుపాముల గ్రామ శివారులో కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మీనరసింహారెడ్డికి స్వల్ప గాయాలు కాగా.. అప్పిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పిరెడ్డి పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి కుమారుడు అచ్చిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన కారును సూర్యాపేట పట్టణంలో పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అనారోగ్య సమస్యలతో మహిళ బలవన్మరణం

యాదగిరిగుట్ట : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళ జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుది. ఈ ఘటన యాదగిరిగుట్ట పట్టణంలో గురువారం జరిగింది. పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన ఈర్ల స్వప్న (35) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. దీంతో మానసికంగా కృంగిపోయి జీవితంపై విరక్తితో గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త గంగారాం, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

చందంపేట: నేరెడుగొమ్ము మండలం వైజాక్ కాలనీలో కృష్ణా నది వెనుక జలాల్లో గల్లంతైన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన తిన్నారపు పృథ్వీరాజ్ మృతదేహం గురువారం లభ్యమైంది. పృథ్వీరాజ్ మంగళవారం స్నేహితులతో కలిసి వైజాగ్ కాలనీలో సరదాగా గడిపేందుకు వచ్చాడు. అదే రోజు ఈత కొట్టేందుకు గాను కృష్ణా నది వెనుక జలాల్లోకి దిగి గల్లంతు కాగా.. గాలింపు చర్యలు చేపట్టిన ఎస్‌ఎడీఆర్‌ఎఫ్ బృందాలకు రెండు రోజుల తర్వాత గురువారం మృతదేహం లభ్యమైంది.

కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పునాదులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వరంజన్ మహంతి

మిర్యాలగూడ : కాంగ్రెస్ పార్టీకి పునాదులు కార్యకర్తలేనని, వారి అభీష్టం మేరకే డీసీసీ అధ్యక్షుడిని ఎన్నుకుంటామని ఏఐసీసీ పరిశీలకుడు బిశ్వరంజన్ మహంతి అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్ భవన్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పుట్టిందే దేశం కోసమని, కాంగ్రెస్‌పై కొందరు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. జిల్లాలో మరో ఐదు రోజులు పర్యటించి డీసీసీ అధ్యక్షుడి ఎన్నికకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజవకర్గ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

యాసంగిలో వేరుశనగ సాగు అనుకూలం



పెద్దవూర: వేరుశనగ సాగుకు యాసంగి అనుకూలమైదని పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్ పేర్కొన్నారు. నూనె గింజల ఉత్పత్తిని పెంచడానికి ఆహార నూనెల జాతీయ యంత్రాంగం పథకంలో భాగంగా ప్రభుత్వం రైతులకు నూరు శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను కొన్ని మండలాల్లో పంపిణీ చేసింది. ఈ పంటను వానాకాలం సీజన్‌లో ఏ పంట విత్తని పొలాల్లో, స్వల్పకాలిక పంటలను సాగు చేసిన పొలాల్లోనూ సాగు చేసుకోవచ్చు.

- శనగను ఆలస్యంగా విత్తినప్పుడు పంట చివరి దశలో బెట్టకు గురై అధిక ఉష్ణోగ్రత వలన గింజ సరిగా గట్టిపడక దిగుబడి తగ్గుతుంది.
- వేరుశనగ సాగు చేయడానికి ముందు 70 రోజుల కాలపరిమితి ఉన్న తృణధాన్యాలైన స్వల్పకాలిక కొర్ర రకాలు కూడా అందుబాటులో ఉన్నాయి.
- వేరుశనగను బంక నేలల నుంచి నల్లరేగడి వరకు ఏ భూమిలోనైనా పండించవచ్చు. చౌడు నేలలు, నీరు నిల్వ ఉండే నేలలు దీని సాగుకు పనికిరావు.

విత్తే విధానం

సాధారణంగా వేరుశనగ పంటను వర్షాధార పంటగా సాగు చేస్తుంటారు. విత్తడానికి సరిపడా తేమ లేనప్పుడు భూమికి ఒక తడి ఇచ్చి విత్తనం వేసుకోవచ్చు. విత్తేటప్పుడు విత్తనాన్ని ఐదు నుంచి ఎనిమిది సెంటీమీటర్ల లోతున తడి మట్టి తగిలేలా జాగ్రత్త తీసుకోవాలి.

- ఒక చ.మీ.కు 33 మొక్కలు ఉండేలా చూసుకోవాలి. నీటి వసతి ఉన్నప్పుడు లావు గింజలు కాబూలీ రకం ఎంచుకున్నప్పుడు వరుసల మధ్య 45 నుంచి 60 సెం.మీ. దూరం పాటించాలి.
- ట్రాక్టర్ ద్వారా వేరుశనగ విత్తు పరికరాన్ని వాడి పొలంలో మొక్కల మధ్య తగినంత సాంద్రత ఉండేలా చూసుకోవాలి. ఈ పరికరం ద్వారా విత్తనాన్ని, ఎరువును ఒకేసారి వేసుకోవచ్చు.



బత్తాయి తోటలో అంతర పంటగా సాగవుతున్న వేరుశనగ

విత్తనశుద్ధి

విత్తనాన్ని విత్తుకునే ముందు ప్రతి కిలో విత్తనానికి పది గ్రాముల ట్రైకోడెర్మా విరిడి పొడిని, మూడు గ్రాముల థైరామ్ లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేయడం వలన విత్తనం ద్వారా, నేల ద్వారా వ్యాపించే తెగుళ్లను చాలా వరకు అరికట్టవచ్చు. కిలో విత్తనానికి 1.5 గ్రాముల టెబ్యుకినజోల్ లేదా 1.5 గ్రాముల ఎటావాక్స్ పవర్‌ను కూడా విత్తనశుద్ధికి వాడవచ్చు. వేరుశనగను మొదటిసారి పొలంలో సాగు చేసినప్పుడు రైజోబియం కల్చర్ పొడిని విత్తనానికి పట్టించాలి.

ఎరువుల యాజమాన్యం

నేల స్వభావం, నేలలో లభించే పోషకాల మోతాదును బట్టి ఎరువులను వాడాలి. హెక్టారు శనగ సాగుకు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం అందించే ఎరువులను వేయాలి. నేలలో భాస్వరం నిల్వలు సరిపడా ఉన్నప్పుడు భాస్వరం ఎరువులు వేయాల్సిన అవసరం లేదు. అనిన ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలి. ఎకరాకు 18 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డీఏపీని వేస్తే పంటకు కావాల్సిన నత్రజని, భాస్వరం అందుతాయి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేస్తే పంటకు కావాల్సిన గంధకం కూడా అందుతుంది. విత్తనాన్ని విత్తిన 24 గంటల్లోగా ఫ్లూక్లోరాలిన్ ఎకరాకు 1 లీటర్, లేదా పెండిమిథాలిన్‌ను 1.2 లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే కలుపును పంట తొలి దశలో సమర్థవంతంగా నివారించవచ్చు. పైరు విత్తిన 30 రోజుల వరకు పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి.

తెగుళ్లు, సస్యరక్షణ చర్యలు..

వేరుశనగ పంటలో ఎండు తెగులు ఆశించిన మొక్కలు ఒక్కసారిగా కాడలతో పాటు ముడుచుకుపోయి చనిపోతాయి. వేరు మరియు కాండాన్ని చీల్చి చూసినప్పుడు గోధుమ లేదా నలుపు రంగులో చార కనిపిస్తుంది. ఎండు తెగులును నివారించేందుకు వేసవిలో లోతుగా దుక్కి దున్నడం వల్ల ముందు పంట అవశేషాలు తీసేయడంతో తెగులు తీవ్రతను తగ్గించవచ్చు.

- వేరుశనగ పంటలో కుళ్లు తెగులు ద్వారా కాండం మొదలులో ఒక నొక్కు ఏర్పడి మొక్క చనిపోతుంది. తెగులు సోకిన తొలిదశలో తెల్లని శిలీంధ్రం బీజాలు ఆవ గింజల మాదిరి కాండం మీద కనిపిస్తాయి. నేలలో ఎక్కువ తేమ ఉండటం, అంతగా కుళ్లని సేంద్రీయ పదార్థం ఉండటం, ఎక్కువ ఉష్ణోగ్రతలు ఈ తెగులు ఉధృతికి తోడ్పడతాయి. విత్తిన పది నుంచి పదిహేను రోజుల తర్వాత పొలంలో మొదలు కుళ్లు గమనించినప్పుడు ఎకరాకు 200 గ్రాముల కార్బండిజమ్, 600 గ్రాముల మాంకోజెబ్‌ను వాడి మొక్కల మొదలు భాగం తడిచే విధంగా పిచికారీ చేయాలి.
- వేరుశనగ పండించే అన్ని ప్రాంతాల్లో శనగ పచ్చ పురుగు ఎక్కువగా నష్టం కలిగిస్తుంది. పురుగును తట్టుకునే రకాలు అందుబాటులో లేవు. పురుగు మందుల వాడకంతో వాటిని అరికట్టవచ్చు. పురుగు సంతతిపై నిఘా ఉంచడానికి పొలంలో ఒక మీటరు ఎత్తులో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకుని పురుగు ఉధృతిని బట్టి నివారణ చర్యలు చేపట్టాలి.
- వేరుశనగ పంటలో పచ్చ రబ్బరు పురుగు నివారణకు ముందుగానే పంట వేసిన 15 రోజులకు ఒక లీటరు నీటిలో 5 మిల్లీలీటర్లు వేప నూనె కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువైతే లీటరు నీటికి 200 మిల్లీలీటర్ల ఇండాక్సాకార్బ్ కలిపి పిచికారీ చేయాలి.

కోత సమయం

ఆకులు పచ్చబారడం, రాలిపోవడం, కాయలు పసుపుగా మారి మొక్కలు ఎండిపోయి గింజ గట్టిగా మారినప్పుడు కోత కోయాలి. పంట కోసిన వెంటనే గింజలను ఆరబెట్టాలి. నూర్పిడి యంత్రాలతో కానీ, చేతితో గాని నూర్పిడి చేసుకోవచ్చు. రైతులు ఈ విధానాన్ని పాటిస్తే మంచి దిగుబడితో పాటు నాణ్యమైన పంటను పొందవచ్చు.